

సమాచార హక్కుచట్టంతో ప్రశ్నించాలి

ఏలూరు:ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ప్రతీ విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుని అందులోని లోటుపాట్లపై ప్రశ్నించి న్యాయం పొందొచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో రాజేశ్వరి స్థానిక వైఎస్ఆర్ కాలనీలో చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీని అందుకున్న 30 రోజుల్లోపు ఈ సమాచారాన్ని సంబంధిత అధికారులు అర్జీదారునికి అందజేయాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు అప్పీల్ చేసుకోవచ్చని, ఎవరైనా 30 రోజులకు మించి, సమాచారాన్ని ఇవ్వని పక్షంలో సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని అర్జీదారు వారంరోజులకే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తారని, ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. వచ్చేనెల 11వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలతను నిర్వహిస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇంతింత బకాయిలైతే.. బతికేదెలా..!

అందని కాంట్రాక్టు కార్మికుల, స్వీపర్ల జీతాలు, అలవెన్సులు
రూ.ఐదు కోట్లకు పైగా బకాయిలు
నోరుమెదపని పాలకులు
వచ్చేనెల 3 నుంచి నిరవధిక సమ్మెకు కార్మికులు సమాయత్తం
ఏలూరు కార్పొరేషన్ తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు కార్పొరేషన్ వ్యవహారశైలి గత కొంతకాలంగా వివాదాస్పదమవుతోంది. ఒకవైపు అవినీతి కుంభకోణాలు బయటపడుతుండగా, మరోవైపు, జీతాల్లేక ఆకలి మంటలతో కాంట్రాక్టు కార్మికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. చిరుద్యోగులకు జీతాలు, అలవెన్సులు చెల్లించకుండా కోట్లాది రూపాయల బకాయిలున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్ ఏడు గ్రామాల విలీనం తర్వాత సుమారు 3.50 లక్షల జనాభాకు చేరింది. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. నిత్యం నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎనలేనిది. అలాంటి కార్మికుల పట్ల కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని పరిస్థితి ఇక్కడ నెలకొంది. కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్సులు, పిఆర్‌సి ఎరియర్స్ సకాలంలో ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు. 430 మంది విలీన పంచాయతీ కార్మికులకు రావాల్సిన తొమ్మిది నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు రూ.రెండు కోట్ల 32 లక్షల 20 వేలు నిలిచిపోయాయి. వీరికి రావాల్సిన గత ఏడాది జూన్ నెల జీతం రూ.64.50 లక్షలు ఇప్పటికీ అందలేదు. 370 మంది పారిశుధ్య కార్మికులకు రావాల్సిన ఆరు నెలల హెల్త్ అలవెన్సు బకాయి రూ.కోటీ 33 లక్షల 20 వేలు పేరుకుపోయాయి. 150 మంది ఇంజినీరింగ్ విభాగం కార్మికుల పదో పిఆర్‌సి ఏరియర్స్ రూ.64.20 లక్షలు ఇవ్వలేదు. 60 మంది స్కూల్ స్వీపర్ల నాలుగు నెలల జీతం రూ.9.60 లక్షలు కూడా నిలిచిపోయాయి. ఏలూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సి పెండింగ్ బకాయిలు రూ.5,03,70,00 ఉండటే పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చు. కార్పొరేషన్‌కు ప్రతినెలా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నప్పటికీ కార్మికులకు జీతాలివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆయిల్ కుంభకోణం, ఉద్యోగ నియామకాల్లో అవినీతి, వాహనాల మాయం వంటి అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కార్మికుల జీతాలు, అలవెన్సులు సంబంధించి కమిషనర్, మేయర్, కలెక్టర్, ఎంఎల్‌ఎలను కలిసి మొరపెట్టుకున్నా వారి గోడు ఎవరూ వినడం లేదు. కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటే వైద్యం చేయించుకునే ఇఎస్ఐ కార్డులు సైతం ఏడాదిగా ఇవ్వడం లేదు. పిఎఫ్ స్లిప్పులు కూడా ఇవ్వడం లేదు. తమగోడు పట్టని పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వచ్చేనెల మూడోతేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగాలని కార్మికులు నిర్ణయించారు. సిఐటియు అనుబంధమైన ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ సమ్మె కొనసాగనుంది. కార్పొరేషన్ పాలకులు, అధికారులు చిరుద్యోగులపై కనికరం చూపి వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తే ఉపయోగకరం. లేనిపక్షంలో ఏలూరు కార్పొరేషన్ తీరు మరోసారి వివాదస్పదమయ్యే పరిస్థితులు ఏర్పడనున్నాయి

కార్మికుల బకాయిలివే..

430 మంది విలీన పంచాయతీ కార్మికుల హెల్త్ అలవెన్సు	రూ.2,32,20,000
430 మంది కొత్తవారికి రావాల్సిన గత ఏడాది జూన్ జీతం	రూ.64,50,000
370 మంది పాత పారిశుధ్య కార్మికుల ఆరు నెలల హెల్త్ అలవెన్సులు	రూ.1,33,20,000
150 మంది ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు పదో పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు	రూ.64,20,000
60 మంది స్కూలు స్వీపర్ల నాలుగు నెలల జీతాలు	రూ. 9,60,000
మొత్తం కార్మికులకు రావాల్సిన బకాయిలు	**రూ.5,03,70,000**

పడకేసిన నిర్మాణాలు..!

ఎక్కడికక్కడ నిలిచిన ప్రభుత్వ భవనాల పనులు
మొండిగోడలు, పునాదులతో దర్శనం
ఏళ్లతరబడి సాగుతున్న నిర్మాణాలు
బిల్లుల విడుదలలో ప్రభుత్వ జాప్యమే కారణం
పనుల ఆలస్యంతో ఏయేటికాయేడు పెరుగుతున్న నిర్మాణ వ్యయం
ప్రజలకు, ఉద్యోగులకు తప్పని అవస్థలు

పునాదుల స్థాయిలో ఉన్న పనులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు పడకేశాయి. వీటి ప్రగతిపై మండలస్థాయి అధికారులు ప్రతీవారం నిర్వహించే సమీక్ష సమావేశాలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ఆరు నెలలుగా వీటి నిర్మాణాలకు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేయాల్సిన సిమెంట్‌ను నిలిపివేయడం, నిర్మాణాలు పూర్తికావొచ్చిన భవనాలకు పూర్తిస్థాయి బిల్లుల చెల్లింపులు లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ జాప్యం వల్ల నిర్మాణ వ్యయం కూడా పెరిగింది. దీంతో గుత్తేదారులు వాటిని నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. హెల్త్ క్లినిక్ నిర్మాణాల విషయంలో. ఈ లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం గతంలో ఒక్కొక్క భవన నిర్మాణానికి అవసరమైన రూ.17.50 లక్షలకు అదనంగా మరో రూ.మూడు లక్షలు కేటాయించినప్పటికీ గుత్తేదారులు ముందుకు రావడం లేదు. మండలంలో 17 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలకు రూ.6.60 కోట్లు కేటాయించగా వీటిలో తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. మండల పరిధిలో 17 రైతు భరోసా కేంద్రాలను నిర్మించాల్సి ఉండగా ఒక్కొక్కదానికి. రూ.21.80 లక్షలు కేటాయించారు. వీటిలో నాలుగు భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. ఆరు భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలినవి ప్రారంభం కాలేదు. 17 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించాల్సి ఉంది. వీటిలో భీమడోలు మినహా ఇతర చోట్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. దీన్ని గమనించిన అధికారులు ఒక్కొక్క నిర్మాణానికి కేటాయించిన రూ.17.50 లక్షలకు అదనంగా మరో రూ.మూడు లక్షలు కేటాయించినప్పటికీ నిర్మాణాల ప్రగతి లేదు. మండలంలో అముల్ పాల సేకరణ కేంద్రాల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.12.81 లక్షలు కేటాయించారు. వీటిలో కోడూరుపాడు, దుద్దేపూడి మినహా ఇతరచోట్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఇక అమూల్ బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ల కోసం ఒక్కొక్క దానికి రూ.18.04 లక్షలు కేటాయించారు. వీటిని గుండుగొలను, పొలసానిపల్లి, ఎంఎం.పురం గ్రామాలకుప్రత్యేకించారు. నిర్మాణాలు ఇంతవరకూ ప్రారంభం కాలేదు. అంబరుపేట, కోరుకొల్లు గ్రామ పంచాయతీలు మినహా మండలంలోని ఇతర గ్రామపంచాయతీల్లో డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ.16.10 లక్షలు కేటాయించగా నిర్మాణాలు ఏ ఒక్కటీ ప్రారంభం కాలేదు. మండల పరిధిలో నిర్మాణాలు ప్రారంభించిన యూనిట్ల విలువ రూ.9.73 కోట్లు కాగా వీటిలో 60 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. 90 లక్షల రూపాయల బిల్లుల చెల్లింపు నెలల తరబడి పెండింగ్‌లో ఉంది. ఇక నిర్మాణపరంగా వస్తే ప్రభుత్వం ప్రాధాన్యత భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సరఫరా చేసేందుకు అంగీకరించింది. ఇదేవిధంగా నిర్మాణాలకు అవసరమైన సిమెంటు బస్తా రూ.270కు అందజేసేందుకు సంసిద్ధత వెలిబుచ్చింది. ప్రభుత్వం సిమెంట్ కంపెనీలకు సకాలంలో చెల్లింపులు జరపని కారణంగా ఆరునెలలుగా సిమెంట్ సరఫరా నిలిచిపోయింది. నిర్మాణాలు ఆగిపోయాయి. ఇదేక్రమంలో ఆ కంపెనీలకు చెల్లించాల్సిన బిల్లులను గృహనిర్మాణ సంస్థ చెల్లించడం వల్ల వారి అవసరాలకు అనుగుణంగా బస్తాకు రూ.270కే అందించడం గమనార్హం. మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.15.86 కోట్లు మంజూరు కాగా వీటిలో సుమారు రూ.ఆరు కోట్ల విలువగల పనులు పూర్తయ్యాయి. కొంతమేరకు చెల్లింపులు జరిగాయి. సుమారు కోటి రూపాయలు బకాయిలు గుత్తేదారులకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం సరఫరా చేస్తానన్న రాయితీ సిమెంట్, ఇసుక సకాలంలో అందజేసి, బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తే నిర్మాణాలు వేగవంతం చేస్తామని గుత్తేదారులు అంటున్నారు. ఇవన్నీ ప్రస్తుత ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పనులు. కానీ అంతకుముందు టిడిపి హయాంలో చేపట్టిన పనులకు ఇంతవరకూ బిల్లుల చెల్లింపు జరగలేదు. నిర్మాణాలు మందగించడం వెనక ఇది కూడా ఒక కారణంగా గుత్తేదారులు పేర్కొంటున్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలి

వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ

పెదవేగి:రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ జెడి ఎ.రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల పంటల సాగు వారోత్సవాలపై శనివారం బి.సింగవరంలో సర్పంచి పరసా సరస్వతి, మండల వ్యవసాయాధికారి పి.ప్రియాంక అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎపి వ్యవసాయ కమిషనరేట్ పురుగుమందుల విభాగ అధికారి ఎన్.సరళ, జెడి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ పూర్వీకులు ఆహార దాన్యాలతో సమానంగా చిరుధాన్యాలను కూడా సాగుచేసి అధిక దిగుబడులతోబాటు అధిక లాబాలను పొందేవారని గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై శ్రద్ధ తగ్గించారన్నారు. సమాజంలో చాలామంది ప్రజలు ఆరోగ్యం కాపాడుకునేందుకు మామూలు ఆహారం వదిలి చిరుధాన్యాలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని రామకృష్ణ చెప్పారు. మెట్టభూముల్లో వులవలు, కందులు, జొన్న, చోడగంటేలు, అలసందలు వంటి పంటలు అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారన్నారు. మాగాణి భూముల్లో వరిసాగు అనంతరం రైతులు ఆరుతడి పంటలుగా పెసలు, మినుము, కంది, మొక్కజొన్న అధికంగా సాగుచేస్తున్నారని వివరించారు. మెట్టమండలాల్లో కూడా రైతులు చిరు ధాన్యాల సాగు పెంచుకోవాలని రైతులకు జెడి సూచించారు. చిరుధాన్యాలు పండించే రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తుందన్నారు. పురుగుమందుల విభాగ అధికారి సరళ మాట్లాడుతూ చిరుదాన్యాల పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు మందులతో పాటు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి డి.విజయ్‌కుమార్‌తో పాటు సచివాలయ వ్యవసాయాధికారులు, గ్రామరైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి భీమడోలు రైల్వే గేటు మూసివేత

భీమడోలు:భీమడోలు - పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య గల 361 నెంబరు భీమడోలు రైల్వే గేట్‌ను ఆ ప్రాంతంలోని గల ఎగువ, దిగువ రైల్వే ట్రాక్‌ల అత్యవసర మరమ్మతులు ఈనెల 30వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి వచ్చేనెల మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ మూసివేస్తున్నట్లు దక్షణ మధ్య రైల్వే ఏలూరు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ తెలిపారు. ఈ మధ్యకాలంలో ఐదో నెంబర్ జాతీయ రహదారి నుంచి భీమడోలుకు వచ్చే రహదారి మధ్యలోని రైల్వేగేట్‌ను మూసివేస్తున్న నేపథ్యంలో వాహనదారులు, పాదచారులు, పశువుల పెంపకందారులు, ప్రత్యామాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

ముఖఆధారిత హాజరును రద్దు చేయాలని ధర్నా

చింతలపూడి:రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముఖఆధారిత హాజరు విధానాన్ని (ఎపిఎఫ్ఆర్ఎస్) రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అనుబంధం రాష్ట్రపిలుపులో భాగంగా చింతలపూడి నగర పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు కూడా వారి మొబైల్స్ ద్వారా ప్రతీరోజు నాలుగుసార్లు లొకేషన్లలో హాజరు తీసుకోవాలని ఇప్పటికే చాలా మున్సిపల్ కార్పోరేషన్లలో కమిషనర్లు కార్మికులకు హుకుం జారీ చేస్తున్నారన్నారు. స్మార్ట్‌ఫోన్ల వాడకం తెలీని మున్సిపల్ కార్మికులు తమ అటెండెండ్స్ పడుతుందో లేదోననే ఆందోళనలో ఉన్నారన్నారు. అంతేకాక ఫీల్డ్‌లో పనిచేసే కార్మికులకు ఫేస్ రీడింగ్ పద్ధతి సాధ్యం కాదని, ఇప్పటికే ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు కార్మికులపై పర్యవేక్షణ ఉందని తెలిపారు. ఇది కాదన్నట్లు ముఖ ఆధారిత హాజరు పడకపోతే వేతనాలకు గ్యారెంటీ లేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ధర్నాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వెలగాడి రాధా, బాలు, మరియమ్మ, మరియదాసు, రాము పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని పరిరక్షించుకోవాలి

జంగారెడ్డిగూడెం:ఆదివాసీల రక్షణ చట్టాల రద్దుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నేత ధర్మల సురేష్ అన్నారు. శనివారం ఆదివాసీల భూములకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని రక్షించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ వందల మంది ఆదివాసీలు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు. అనంతరం ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, అరుణోదయ నాయకులు పి.శ్రీనివాస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ నాయకులు కారం రాఘవ పిఒడబ్ల్యూ నాయకులు వెట్టి భారతి పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

ఒపిఎస్‌తోనే సామాజిక భద్రత : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు

భద్రతలేని జిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఒపిఎస్‌ను అమలు చేయాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫా అలీ అధ్యక్షతన జరిగిన ఏలూరు డివిజన్ సిపిఎస్ సదస్సులో సాబ్జీ మాట్లాడారు. సిపిఎస్, జిపిఎస్ ఏదైనా ఉద్యోగ దోపిడీ అని ఒపిఎస్ అమలే సామాజిక బాధ్యతని చెప్పారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశాయని, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ ప్రభుత్వాలు ఒపిఎస్ అమలు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ పోరాటాలు పెరిగి సిపిఎస్ రద్దయ్యే పరిస్థితులు చుట్టుముడుతున్న నేపథ్యంలో ఒపిఎస్ అమలు కాకుండా జిపిఎస్ అనే కొత్త విధానాన్ని ముందుకు తెచ్చి ఉద్యోగులను మభ్యపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం అంటూ సమావేశాలు పెడుతూ జిపిఎస్‌ని ముందుకు తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ సహాధ్యక్షులు బి.సుభాషిణీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ, జిల్లా కార్యదర్శులు ఎన్.రాంబాబు, ఎస్.సుధారాణి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.కమల్, సిపిఎస్ జిల్లా కె.కిరణ్, లక్ష్మణరావు, సిపిఎస్ సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో డ్రైవర్లకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి, కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి జినగం గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య భవనంలోని ప్రజా సంఘాలు కార్యాలయంలో కుక్కునూరు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం వేల్పుల దుర్గయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ఆటో డ్రైవర్ల కష్టాలు ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రవాణారంగంపై అనేక రూపాలలో పన్ను విధిస్తూ తమ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయన్నారు. కానీ పన్ను కడుతున్న ఆటో కార్మికులను చలనాల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. కుక్కునూరులో ఆటో కార్మికులకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేకపోవడం వలన ప్రయాణికులు, ఆటోలు ఎక్కడం లేదని, అసలే రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుపోతుంటే కనీసం కూలి డబ్బులు అయిన ఇంటికి వెళ్లే పరిస్థితి లేక కుటుంబ పోషణ ఇబ్బంది అవుతుందని, ప్రభుత్వ అధికారులు స్పందించి ఆటోలకు పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని, ఆటోలు కొనుక్కోవడానికి సబ్సిడీ ఇవ్వాలని లేదంటే సమస్యలు పరిష్కారం కోసం రవాణా రంగం కార్మికులను ఐక్యం చేసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, ఆటో కార్మికులు శనగ రాము, సత్తి సంపత్, రాము, రాజు, మహేష్, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోపీ

ఆందోళన చేస్తున్న దళితులు

దళితులకు న్యాయం చేయండి

కులం పేరుతో దూషించిన భూస్వాములపై అట్రాసిటీ కేసులు పెట్టాలి
వ్యకాస ఆధ్వర్యాన ఆందోళన

దెందులూరు :2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి దళితులకు చెందిన అసైన్డ్ భూములను తక్షణం వారికి అప్పగించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దోసపాడు చేపల చెరువుల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల, దళితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దోసపాడులోనే 25 ఏళ్ల నుండి స్థానికేతర భూస్వాములు చట్టాన్ని ధిక్కరిస్తూ అసైన్డ్ భూమిని పేదలకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. 25 ఏళ్ల నుండి అసైన్డ్ చట్టాలను తుంగలోకి తొక్కిచేపల చెరువులు తవ్వి దర్జాగా భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం పంట భూముల్లో చేపలు, రొయ్యల చెరువులు తవ్వకూడదన్నారు. కానీ విజయవాడకు చెందిన దేవినేని బాజీ ప్రసాదు ఆయన అనుచరులు, బినామీలు రెవెన్యూ శాఖ కనుసన్నల్లోనే ఈ చట్ట వ్యతిరేక పనులు చేస్తున్నారని విమర్శించారు. చట్టాలను ధిక్కరిస్తున్న భూస్వాములపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదల భూములు పేదలకే పంచాలని, గత ఎనిమిది నెలల నుండి దోసపాడు దళితులు పేదలు కలిసి పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని విమర్శించారు. సర్వే నెంబర్ 208, 213, 214, 216,221, 225,226 227, 231లో సుమారు 150.21 ఎకరాల భూమిని 1973కి ముందు ప్రభుత్వం ఈ భూములను అసైన్డ్ చేసి పేదలకు కేటాయించిందన్నారు. ఆ భూములపై భూస్వాములు కొల్లేరు పరిరక్షణ పేరుతో బలవంతంగా లాక్కొని, చేపలు, రొయ్యల చెరువుల చెరువులుగా మార్చి పేదలపొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు, లాజరమని, చవ్వలమూడి దేవ కృప, భూ పోరాట నాయకులు డి.నాగేంద్ర, పి.వెంకటరమణ, డి.కుమారి, బొంతు బేబీ, పి.సునీలక్ష కె వినోద్ కుమార్, సిహెచ్.లలిత పాల్గొన్నారు. ఈనెల 30వ తేదీన నూజివీడు డిఎస్‌పిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు.

చట్టాలకేదీ రక్షణ..!

1/70, కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమం ఉధృతం
రైతు యాత్రలు విజయవంతం
రోడ్డెక్కిన 108, అంగన్‌వాడీలు
ప్రజా సమస్యలు పట్టని బిజెపి పెద్దల సమావేశం



మన నేతలు తరచూ చెప్పే మాట 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది'. మరి ఆ చట్టాన్నే అమలు చేయాలని ఇప్పటి వరకూ ఆందోళనలు, పోరాటాలు సాగేవి. కేంద్రంలో బిజెపి పాలకుల తీరుతో ఆ చట్టాలను పరిరక్షించండి అంటూ వాటి రక్షణ కోసం సగటు జీవి పోరాడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని దేశవ్యాప్తంగా కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవలోకే వస్తుంది 1/70 చట్టం పరిరక్షణ ఉద్యమం. జిల్లాలో ఐదు ఏజెన్సీ మండలాలు పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు ఉన్నాయి. వీటిలో రాష్ట్ర విభజనకు ముందున్న పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 1/70, పీసా చట్టాలు అమలు చేయాలని చాలాకాలంగా పోరాటాలు సాగుతున్నాయి. ఆ మూడు మండలాల పరిధిలోనే సుమారు 50 వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి గిరిజన శాఖా మంత్రి రెడ్యానాయక్ ప్రకటించడం, ఆ భూముల వెలికితీతకు చర్యలు తీసుకుంటామని నాడు ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడిచాయి. నేటికీ ఆ భూముల సంగతి అతీగతీ లేకపోయినా తాజాగా పోలవరం ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టుల పేరుతో అటవీ భూములను నిలువునా ముంచుతూ ఏజెన్సీ ధ్వంసం పెద్దఎత్తున సాగుతోంది. ఇదంతా చట్టవిరుద్ధంగా అధికారయంత్రాంగం, ప్రభుత్వ పెద్దల కన్నుసన్నలో సాగిస్తుండటం ఆందోళనకరం. అటవీహక్కుల చట్టాన్ని ఈ పాలకులు, అధికారులు అటకెక్కించిన సంగతి తెలిసిందే. చివరకు కోర్టుల తీర్పులను సైతం పక్కనపెట్టి గిరిజనుల భూముల్లో గిరిజనేతరులు పంట సాగు చేస్తుంటే అధికారులు వారికి రక్షణ కల్పిస్తుండటం గమనార్హం. పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి కేటాయింపు అంశంలోనూ అధికారుల తీరు వివాదాస్పదమైంది. ఈ మొత్తం వివాదాలన్నింటినీ పరిశీలిస్తే 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోవడమే కారణమని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన పాలకులు ఆ చట్టానికి తూట్లు పొడిచి దాని మనుగడకే చేటు తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఆ చట్టం గూర్చి సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు కావడమే దీనికి నిదర్శనం. ఇప్పటికైనా పాలకులు వట్టిమాటలు కట్టిపెట్టి గిరిపుత్రుల గుండెకాయ వంటి 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని అంతా కోరుతున్నారు.

వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో సాగిన రైతాంగ ఉద్యమం అందరికీ తెలిసిందే. ఆ సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం రైతులు మళ్లీ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రోడ్డెక్కాల్సి వచ్చింది. గణతంత్ర దినోత్సవం నాడు జిల్లాలో ఏలూరు, చింతలపూడి, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్లతో ర్యాలీలు నిర్వహించి గళమెత్తారు. పంటలకు మద్దతు ధర చట్టంతోపాటు మద్దతు ధరల అమలుకు గ్యారెంటీ చట్టం తీసుకురావాలనేది రైతుల ప్రధాన డిమాండ్. జిల్లాలో గత దాళ్వా, సార్వా సీజన్లలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. గతంలో ఎన్నడూ లేనంతగా పంట అమ్ముకోవడానికే రోడ్డెక్కాల్సి రావడం రైతులను ఆలోచింపజేసింది. ఫలితంగా రైతు ర్యాలీలు విజయవంతమయ్యాయని చెప్పొచ్చు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆ హామీల అమలుకు కార్యాచరణ ప్రకటిస్తుందా లేక మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటి ప్రధాన అంశంలో చేసిన మోసాన్నే దేశవ్యాప్తంగా రైతుల విషయంలోనూ కొనసాగిస్తుందా లేక తీరు మార్చుకుని ఇచ్చిన హామీ అమలు చేస్తుందా అనేది వేచిచూడాలి.

ఇక అంగన్వాడీలు ఫేస్‌యాప్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని అంగన్వాడీలు, తమ సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 108 సిబ్బంది ఇటీవల ఆందోళనబాట పట్టారు. ఇవేమీ వారు కొత్తగా పెట్టిన డిమాండ్లేమీ కాదు. గత ఎన్నికల సందర్భంగా నాడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్ ఇచ్చిన హామీలే. ఆ హామీలను అమలు చేయాలని కోరుతున్నా పాలకపక్షంలో చలనం లేదు. ఈ నేపథ్యంలో వారంతా రానున్న రోజుల్లో తమ ఆందోళనను రెండు జిల్లాల్లోనూ ఉధృతం చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

రాజకీయ వైఖరిపైనా అస్పష్టత.. ప్రజా సమస్యల ఊసే కరువు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం భీమవరంలో అట్టహాసంగా జరిగింది. ఆ పార్టీ ముఖ్యనేతలుగా చెబుతున్న పురంధరేశ్వరి, సుజనాచౌదరి వంటి వారు గైర్హాజరవ్వగా అసమ్మతి నేత కన్నా లక్ష్మీనారాయణ దూరంగానే ఉన్నారు. ఇక కేంద్రం పథకాలనే ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు తమవి చెప్పుకుంటూ అవినీతికి పాల్పడుతున్నాయంటూ గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని తీర్మానం కూడా చేశారు. అయితే రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై చర్చే లేదు. కనీసం సమావేశాల వేదికైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావాసులకు గతంలో తామిచ్చిన కొల్లేరు సమస్య పరిష్కారం, ఆక్వారంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు, నరసాపురం వద్ద వశిష్టగోదావరిపై వంతెన నిర్మాణం, కోటిపల్లి-నరసాపురం, కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్ వంటి అంశాల గురించి ప్రస్తావనే లేదు. అంటే బిజెపి నేతలు ఏయే అంశాలపై దృష్టి సారిస్తారో.. ప్రజా సమస్యలకు ఎంత ప్రాధాన్యతనిస్తారో ఈ సమావేశాలు చెప్పకనే చెప్పాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పెద్దల దగ్గర నుంచి రాష్ట్ర, జిల్లాస్థాయి నేతల వరకూ అందరిదీ అధికారమే పరమావధి తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడేవన్నీ వట్టి బూటకమేనని మరోసారి స్పష్టమైంది.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

30, 31 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం మండలం ఏజెన్సీలో గత 30 ఏళ్ళగా గిరిజనులు సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఈ నెల 30, 31 తేదీలలో రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని జిల్లెళ్లగూడెం, ప్రగడపల్లి, కోండ్రుకోట, తూటిగుంట, చేగొండపల్లి పంచాయతీల్లో అన్యాక్రాంతమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని 1990 నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్నారు. ఆ భూములకు హక్కులు కల్పించాలని పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా స్పందించడంలేదన్నారు. ఏజెన్సీలో వివాద భూముల్లో సాగులో ఉన్న గిరిజనుల భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

స్పందన ఫిర్యాదుపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం రెవెన్యూ పరిధిలోని 82వ సర్వే నెంబర్‌లో దేవర రాజకుమార్‌కు చెందిన 19 ఎకరాలు భూ వివాదంలో ఉన్నట్లు కొన్ని రోజుల క్రితం ఏలూరు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆర్‌డిఒ ఝాన్సీరాణి దర్భగూడెం రెవెన్యూ పరిధిలోని 82వ సర్వే నంబర్ గల భూమిని శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డివిజన్ సర్వేయర్‌తో కలిసి భూమి సరిహద్దు ప్రాంతాలను పరిశీలించారు. భూ రికార్డ్ వెరిఫికేషన్ చేశారు. అనంతరం ఫిర్యాదు దారుడికి సమాచారం అందించగా అతను ఆసుపత్రిలో ఉన్నట్లు తెలిపారు. ఇరు గ్రూపులు వచ్చిన తర్వాత వారి సమక్షంలో భూ రికార్డ్ ప్రకారం సర్వే చేసి వివరాలు తెలపాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఆమెతో పాటు డివిజనల్ సర్వేయర్ రెడ్డి, తహశీల్దార్ ఎలీషా, విఆర్ఓ లాల్ పాషా, విఆర్ఎ బాషా పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలు జాతర ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని గాలాయిగూడెంలో ఉన్న అచ్చమ్మ పేరంటాలు జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దెందులూరు ఎంఎల్ఎ తండ్రి కొఠారు రామచంద్రరావు జాతర ఉత్సవాలను ప్రారంభించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు పూజలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ, టీవీ రంగంలో ప్రముఖులతో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు మాట్లాడుతూ జాతర ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాతరలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్లాస్టిక్ సిలిండర అందుకుంటున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రమాదాల నివారణకు ప్లాస్టిక్ సిలిండర్లు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రమాదాలను నివారించేలా ప్లాస్టిక్ సిలిండర్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక శ్యామలంబ గ్యాస్ ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ అల్లాడ పూర్ణచంద్ర ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సిలిండర్లు తొలి ఖాతాదారునిగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుకు శనివారం పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదరహిత సిలిండర్ల వాడకంపై మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. తద్వారా ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ సిలిండర్లని వినియోగించేలా చర్యలు తీసుకుని అందించాలన్నారు. అనంతరం తొలి ఖాతాదారునిగా ధ్రువీకరణ పత్రాన్ని సిలిండర్‌ను ఎంఎల్ఎకు అందించారు.

31న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - నూజివీడు

రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జనవరి 31వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు తెలిపారు. జాబ్ మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, వెయ్యి మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదివిన 18 నుంచి 37 సంవత్సరాలు మధ్య వయస్సు వారు జాబ్‌మేళాలో పాల్గొనాలని తెలిపారు.

ఆగడాలలంకలో 'హౌసింగ్ డే'

ప్రజాశక్తి - భీమడోలు

ప్రతి శనివారం నిర్వహించే హౌసింగ్ డే కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందని భీమడోలు మండల ప్రత్యేక అధికారి జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవిఆర్.గంగాధరరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం ఆగడాలలంకలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో అధికారులు నిర్వహించిన చైతన్య సదస్సుల కారణంగా ఆ ప్రాంతంలో గృహ నిర్మాణం పట్ల లబ్ధిదారులు ఆసక్తి కనపరుస్తున్నారని తెలిపారు. సదరు గ్రామానికి మంజూరైన రెండు జగనన్న లే అవుట్‌లలో 115 గృహాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే పంచాయతీ కాలనీలో రోడ్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టిందని, నిర్మాణానికి అవసరమైన నీటి సరఫరా కోసం గ్రామపంచాయతీ ప్రత్యేక ఏర్పాటు చేసిందని వివరించారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న 23 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్లకు ట్రాన్స్ కో విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాఘవన్, గ్రామపంచాయతీ కార్యదర్శి మురళీమోహన్ కృష్ణ ,వివిధ శాఖల సహాయ ఇంజినీర్లు సతీష్, రామస్వామి, రామారావుతో పాటు ఉపాధి హామీ ఎపిఒ, వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం పాల్గొన్నారు.

మద్ది ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం వెయ్యి మంది యాత్రికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. శనివారం ఆలయానికి యాత్రికులు అధిక సంఖ్యలో తరలి వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఒక్క రోజు ఆదాయం రూ.95,010లు సమకూరిందని తెలిపారు. ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు యాత్రికులకు తగిన సేవలు అందించారని ఇఒ ఎ.కొండలరావు తెలిపారు.

ఎంపిటిసిలకు గుర్తింపు కరువు

ప్రజాశక్తి - చాట్రాయి

ఎంపిటిసి సభ్యులకు తగిన గుర్తింపు లేదని ఎంపిటిసి సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయంలోకి వెళ్లిన సందర్భంలో వారికి కనీస గుర్తింపు ఉండటం లేదన్నారు. ప్రతీ సచివాలయంలో ప్రత్యేక ఛాంబర్ కేటాయించాలన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు.

రక్తసిక్తమవుతున్న జీలుగుమిల్లి..!

10 రోజుల్లోనే 3 దారుణ ఘటనలు

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చుట్టూ పచ్చని పంటలతో ఎప్పుడూ పోలం పనుల్లో నిమగ్నమై ఎటువంటి వివాదాలు లేకుండా ఉండే పల్లెల్లో వరుసగా జరుగుతున్న దారుణ ఘటనలతో మండల ప్రజానీకం భయభ్రాంతులకు గురవుతున్నారు. పది రోజుల్లోనే పలు దారుణ ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నూతన సంవత్సరం ప్రారంభంలో ప్రజానీకం పండుగ వాతావరణంలో ఉండగా ఉలిక్కిపడే ఘటన చోటు చేసుకుంది. దాట్లవారిగూడెం గ్రామంలో పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లిన మహిళ సున్నం వెంకటలక్ష్మిని అదే గ్రామానికి చెందిన లక్ష్మణరావు లోబరుచుకొని గర్భిణిని చేశాడు. ఆ మహిళ తనను పెళ్లి చేసుకోమని అడిగినందుకు నిర్దాక్షిణ్యంగా ప్రాణాలను తీసుకెళ్లి కర్రతో కిరాతకంగా కొట్టి చంపి అదే ప్రాంతంలో పాతిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో మండలం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన మూడు రోజులకే జీలుగుమిల్లి గ్రామానికి చెందిన ఊర్ల రామదాసుకు, శ్రీలతకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో రామదాసు తన భార్య శ్రీలతను అతి కిరాతకంగా కత్తిపీటతో తలపై విచక్షణ రహితంగా నరికి చంపిన ఘటన మండలం మొత్తం కలకలం సృష్టించింది. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జీవనం చోటు చేసుకున్న భూ వివాదంలో మధ్యాహ్నపు వెంకటేశ్వరరావు (వంటి) తాను కొనుగోలు చేసిన భూమికి అడ్డు వస్తుందని పోరెడ్డి సుబ్బలక్ష్మి అనే మహిళను కత్తితో తలపై నరికిన ఘటన పెను సంచలనం రేపింది. క్షణికావేశానికి గురై ఇటు ప్రాణాలను సైతం బలి తీసుకొని కుటుంబాలు చిన్నాభిన్నమై జైలులో ఊసలు లెక్కపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పది రోజుల వ్యవధిలోనే వరుసగా మూడు దారుణ ఘటనలు చోటు చేసుకోవడంతో మండల ప్రజానీకం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండుగొలను సొసైటీ పాలకవర్గాన్ని కొనసాగించాలి

మహాజన సభలో సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

మాట్లాడుతున్న వెంకటభాస్కర్

విశాల సహకార పరపతి సంఘం ప్రస్తుత పాలకవర్గాన్ని మరొక మారు కొనసాగించాలని శనివారం నిర్వహించిన గుండుగొలను సంఘ మహాజన సభలో తీర్మానించారు. ఈ మేరకు సమావేశానికి హాజరైన 259 సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘ మహాజన సభకు అధ్యక్షత వహించిన చైర్ పర్సన్ వగ్వాల విజయ వెంకట భాస్కర్ మాట్లాడుతూ సంఘం ద్వారా పంట రుణాలు, దీర్ఘ కాలిక రుణాలు, రైతుల అవసరాల మేరకు వ్యవసాయ అనుబంధ రుణాలు, పశుసంవర్ధక శాఖ పరిధిలోని వివిధ విభాగాలపై ఆధారపడి జీవిస్తున్న పాడి రైతులు, ఇతర రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక రుణాలు అందిస్తున్నామన్నారు. ఎరువుల రుణాలు, బంగారం హామీపై రుణాలు, వ్యవసాయ క్యాష్ అండ్ క్రెడిట్ రుణాలు అంది స్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ హయాంలో సంఘం సభ్యుల సంఖ్య 2,376 నుంచి 2,673కి పెరిగిందన్నారు. గత రెండేళ్ల కాలంలో సంఘం ద్వారా నిర్వహించిన వ్యాపార కార్యకలాపాలు రూ.32.42 కోట్ల నుంచి రూ.53.05 కోట్లకు పెరిగి వృద్ధి శాతం 164గా నమోదైందన్నారు. డిపాజిట్లు రూ.5.20 కోట్ల నుంచి రూ.9.45 కోట్లు పెరిగి 181 శాతం పెరుగుదల నమోదైందన్నారు. డిపాజిట్లకు వారి డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ అత్యధికంగా 8.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 9.25 శాతం చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత దాళ్వా సీజన్లో సంఘం ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు హమాలీ ఛార్జీలుగా 40 కేజీల బస్తా ఒక్కింటికి రూ.పది వంతున చెల్లించామని, ఈ తరహా కార్యక్రమం చేపట్టిన మొట్టమొదటి సంఘంగా జిల్లాస్థాయిలో తమ సంఘం గుర్తింపు పొందిందన్నారు. ఇప్పటికే సంఘ చరిత్రలో వ్యాపార లావాదేవీల ద్వారా అత్యధిక లాభాలు సాధించిన పాలకమ ండలిగా ప్రస్తుత పాలకమండలి గుర్తింపు పొందిందన్నారు. ఆగడాలలంకలో సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మించేందుకు 60 సెంట్ల స్థల సేకరణ కార్యక్రమం గ్రామస్తుల సహకారంతో పూర్తయిందని, కేంద్ర సహకార బ్యాంకు అనుమతులు రాగానే సంఘం నిధులతో సదరు నిర్మాణాలను చేపడతామన్నారు. గుండుగొలను కేంద్రంగా సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మించేందుకు చర్యలు తీసుకున్న ప్పటికీ స్థలం కేటాయింపు సమస్యగా మారిందని, పరిష్కారానికి తమ పాలకవర్గం కృషి చేస్తుందని చెప్పారు. సంఘ సిఇఒ జగదీష్‌కుమార్ సంఘ 2023-24 అంచనా బడ్జెట్, ఇతర అంశాలను సభ ఆమోదం కోసం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎంపిపి కె.రామయ్య, ఆగడాలలంక సర్పంచి భలే రాంబాబు, గుండుగొలను గ్రామపం చాయతీ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు, భీమడోలు మాజీ ఎంపిపి కొండబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ సేమ్యానాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు విషయంలో ఏ విద్యార్థి కుడా వెనుక పడకూడదన్నారు. ఆ విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

మర్లగూడెంలో 'పొలంబడి'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని మర్లగూడెం గ్రామంలో పూసం సత్తిబాబు మొక్కజొన్న పొలంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయాధికారి బి.సుమలత మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమంలో మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు పలు సూచనలు చేశారు. మిరపపంట వేసే రైతులు విత్తన శుద్ధి చేయాలని చెప్పారు. రైతులందరూ వడ్డీ పంట రుణాలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి అందుగుల శేషారత్నం, రైతులు, వాలంటీర్లు, వ్యవసాయ సహాయక సిబ్బంది ఎం.సురేష్, వి.మౌనిక, ఎం.ఉదయభాను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని గొల్లపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు శనివారం శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించే 1.20 లక్షల లీటర్ల ఒహెచ్ఎస్ ట్యాంక్, కొత్త పైపులైన్ ద్వారా కుళాయిల ఏర్పాటుకు, రూ.16 లక్షలతో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులకు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పంచాయతీ సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ శంకుస్థాపన చేశారు. అనంతరం పిహెచ్‌సిని సందర్శించి నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ.53 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను, ఆధునిక సాంకేతిక వైద్య పరికరాలు, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం శ్రీ రఘునాధ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒటిఎస్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు గుడిమెల్ల కృష్ణంరాజు, నూజివీడు ఎంపిపి ఆరేపల్లి శిరీష పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి - గణపవరం

అప్పన్నపేటకు చెందిన సిపిఎం అభిమాని బసవవెంకటమ్మ(68) శనివారం సాయంత్రం తన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆమె కుమారుడు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఆమె మృతికి పార్టీ మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు ఎంపెంటారావు, గుత్తుల శ్రీను, వెంకటమ్మ సంతాపం తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రులో ఉపాధి హామీ పనులు శనివారం ప్రారంభమయాయి. ఇందులో భాగంగా పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలను బాగుచేసే పనులు చేపట్టారు. పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు తొలగించారు.

సంతృప్తికరంగా సంక్షేమ పథకాల అమలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. శనివారం స్థానిక మూడో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ కంచర్ల వాసవి రత్నం, ముప్పిడి వీరాంజనేయులు, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : రాష్ట్రంలో ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వడాలిలో శనివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం అధికారులతో కలిసి ఎంఎల్ఎ నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల కన్వీనర్ మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, గ్రామ సర్పంచి మరీదు దుర్గశ్రీ, ఎంపిటిసి పల్లి నాగరాజు, పార్టీ శ్రేణులు ఈడే వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ భిక్షాలు, హనుమంతు రాధా, నాగయ్య, శేషుబాబు, కిషోర్, వీరారెడ్డి, ఎం.సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో సహకార రంగం

ప్రజాశక్తి - ఏలూరు

అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ముద్రించిన నూతన సంవత్సర డైరీలను స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పివి.సత్యనారాయణ ఈ డైరీని ఆవిష్కరించారు. కాపీని యూనియన్ గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రాజు మాట్లాడుతూ సహకార రంగం సంక్షోభంలో ఉందని చెప్పారు. 50 శాతం షేర్లను ప్రయివేటీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిందని, దీంతో సన్న చిన్న కారు రైతాంగానికి రుణాలు అందని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ సహకార రంగాన్ని కాపాడుకోవాల్సిన తరుణం ఏర్పడిందన్నారు. సహకార ఉద్యోగులు, రైతులు ఏకతాటిపై ప్రభుత్వ నిర్ణయాలను ఎదుర్కొని సహకారంగాన్ని కాపాడుకోవాలన్నారు. లింగరాజు మాట్లాడుతూ కార్మిక చట్టాల, హక్కులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న దుందుడుకు విధానాలను ప్రతిఘటిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ఐదు లక్షల మంది పైగా కార్మికులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారావు, కోశాధికారి జి.వీరయ్య పాల్గొన్నారు.

ఎంపిడిఒ మల్లేశ్వరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి

ఎంపిడిఒ మల్లేశ్వరికి మొక్కను అందిస్తున్న భాస్కరరావు, అప్పారావు

నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో ప్రజలకు సేవ చేసే అధికారులు అరుదుగా ఉంటారని వారిలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.మల్లేశ్వరి ఒకరని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చేతుల మీదుగా ఉత్తమ ఎంపిడిఒ పురస్కారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందుకున్న ఆమెను స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదినేపల్లి మండలానికి ఎంపిడిఒగా పనిచేస్తూ మండవల్లి మండలానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బాధ్యతలు చేపట్టి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపే విధంగా ఉత్తమ సేవలందించినందుకు చాలా సంతోషమన్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ మండలంలో జటిలమైన సమస్యలను తనదైన శైలిలో పరిష్కరిస్తూ అత్యంత నిజాయితీ కలిగిన అధికారినిగా విధులు నిర్వహిస్తూ సమర్థమైన ఎంపిడిఒగా పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రజాసేవకే అంకితమై పనిచేసే అధికారులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందడం సర్వ సాధారణమేనన్నారు. మరిన్ని సేవలందించి మరిన్ని అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందాలని ఈ సందర్భంగా ఆమెను కోరారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామసూరిరెడ్డి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొల్లి రామసూరిరెడ్డి నియామకం అయినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాధరావు తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం వద్ద కొల్లి రామసూరిరెడ్డికి జెట్టి గురునాధరావు శనివారం నియామక పత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా జాతీయ యువజన కాంగ్రెస్ నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొల్లి రామసూరిరెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రామాసురి రెడ్డికి శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు గౌతు సత్యేంద్రబాబు, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మొగిలినీడి శ్యామ్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వేలేరుపాడు

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలనీ, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం మండల మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సిపిఎం కార్యాలయంలోని కోటా రమేష్‌బాబు గ్రౌండ్‌లో గిరిజన సంఘం మండల ఆరో మహాసభను శనివారం జరిగింది. తొలుత పూసం రాంబాబు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సభకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వల్ల ఆదివాసీలు అనేక రకాలుగా నష్టపోతున్నారన్నారు. వారికి పరిహారం అందించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కాపర్ డ్యాం నిర్మించడంతో బ్యాక్ వాటర్ ప్రభావంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్‌రెడ్డి, మడకం ఏసుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మడివి దుర్గారావు, పోలోజు నాగేశ్వరావు, కారం భాస్కర్, కారం, వెంకట్రావు, ఊకే మహాలక్ష్మి, సీత, నాగరత్నం, నర్సయ్య పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేయాలి

చాట్రాయి:మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే ద్విచక్ర వాహన రుణాలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అతి తక్కువ వడ్డీతో టూ వీలర్‌పై రుణ సౌకర్యాన్ని ముత్తూట్ బ్లూ(ముత్తూట్ ఫిన్‌కార్ప్) కల్పిస్తుందని ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఏరియా మేనేజర్ శివకుమార్ అన్నారు. శనివారం రథసప్తమి సందర్భంగా ఆగిరిపల్లిలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్ బ్రాంచిలో యాక్టివిటీ టూ వీలర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ టి.ప్రవీణ్‌కుమార్, వినోద్ పాల్గొన్నారు.

శోభనాచల ఆలయానికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

లక్ష్మీనరసింహ స్వామి మాఘమాస రథసప్తమి తిరునాళ్ల సందర్భంగా శనివారం స్థానిక శ్రీశోభనాచల ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు. నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు ఏర్పాట్లను పరిశీలించారు.

వ్యాధిగ్రస్తునికి పర్వతనేని సాయం

చాట్రాయి:నూజివీడు నియోజకవర్గ టిడిపి నేత పర్వతనేని గంగాధర్ పోతనపల్లి మాజీ సర్పంచి మందలపు జయప్రద కుమారుడు కాంతారావు అనారోగ్యంతో బాధపడటంతో ఆర్థికసాయం చేశారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.36వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బసవరెడ్డిచ నాయకులు హనుమంతరావు, అబ్బుల చౌదరి, పలగాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

క్రీస్తు బోధించిన శాంతి, కరుణ, సామరస్యం అనుసరణీయమని సాల్వేషన్ ఆర్మీ 126 దేశాల అధిపతి, జనరల్ బ్రియన్ పేడ్లే, కమిషనర్ రోజిలిన్ పేడ్లే పేర్కొన్నారు. ఏలూరు సాల్వేషన్ ఆర్మీ గ్రౌండ్లో జరుగుతున్న మహిళా కాంగ్రెస్ మహాసభలో ప్రసంగించేందుకు ఇంగ్లాండ్ దేశం నుంచి శనివారం ఏలూరు విచ్చేశారు. ఆయనకు క్రైస్తవ అభిమానులు ఘనస్వాగతం పలికారు. గుర్రపు బగ్గీపై ఆయనను ఊరేగించారు. అనంతరం చర్చిలో ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలగూడెం మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

నేరాలు - ఘోరాలు

వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

ప్రజాశక్తి - దెందులూరు

చేపలకు ఆహారంగా వేసే వ్యర్థాల వాహనాన్ని శనివారం సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు తెలిపారు. మండలంలోని దోసపాడు దళితుల వివాదాస్పద చేపల చెరువుల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ నుంచి డిసిఎం వాహనంలో పలు హోటళ్లు, దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలను ఈ వివాదాస్పద చేపల చెరువులో మేతకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేరు మార్పు

చెన్నారెడ్డి స్వరూప్, తండ్రి : ఎమ్‌విఆర్‌ఎస్‌ఎస్ నాగభూషణం, నివాసం : డి.నెం.7-77, చెన్నారెడ్డివారి వీధి, కైకరం గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క **పాన్ పోర్టు (నెం.K2759345)** లో నా యొక్క తండ్రి గారి పేరు **నాగ భూషణం చెన్నారెడ్డి** అని, అనితప్పుగా నమోదు కాబడినది. కాని నా యొక్క ఆధార్ మరియు డ్రైవింగ్ లైసెన్స్‌లో నా తండ్రి గారి యొక్క సరియైన పేరు **ఎమ్‌విఆర్‌ఎస్‌ఎస్ నాగ భూషణం చెన్నారెడ్డి** గా అన్ని వ్యవహారాలలో వ్యవహరించవలెను.

ప్రకటన

మహారాజశ్రీ నిడదవోలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

I.A.No.5/2023, I.A.No.6/2023 in O.S. No.73/2009

Between :
Bodapati Suryavathi (Died) and Others ...Petitioners/Plaintiffs
Vs
Kamisetti Venkataratnam (Died) and Others ...Respondents/Defendants

To:
9th Defendent
Respondent : Sri Suravarapu Radhakrishna, S/o. Late Gangaraju, Age 50 years, D.No. 20-10-42, Velpur Road TANUKU ...Tanuku PJCJC
10th Defendent
Respondent : Smt. Boddana Saradha, W/o. Mahesh, Age 46 years, Hindu Female, D.No. 20-10-42, Velpur Road TANUKU ...Tanuku PJCJC

పై నంబరు వంపకం దావాలో 3వ ప్రతివాది అయిన శ్రీమతి సూరవరపు సత్యవతి గారు మీకు తల్లిగారు అయివున్నారు, మీ తల్లిగారు పైదావానందు మొదటి దశలోనే ఎక్స్‌పార్టీ అయి ఉన్నారు, దరిమిలా మీ తల్లిగారు చనిపోయినారు అని తెలియవచ్చినది కావున వారి స్థానే వారి వారసులు అయిన మిమ్మల్ని పైవంపకం దావాలో 9 మరియు 10వ ప్రతివాదులు గా చేర్చమని పిటిషన్ దాఖలు చేసియున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం **ది.08-02-2023 సం॥రం తేదిన ఉ.గం. 10-30 ని॥ల** లగాయితూ మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

Place : Nidadavole
Date : 28.01.2023
K.S.N. MURTHY, Advocate, Nidadavole

పాస్‌పోర్టు పోయినది

MYLABATHULA JEEVAN KUMAR అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది. 05-02-2013న **K9437863** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. ఆగర్తిపాలెం గ్రామం నుండి నరసాపురం పట్టణంలోని మా బంధువుల ఇంటికి వెళ్ళిన సందర్భంలో సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మెయిన్‌రోడ్డుకు వెళ్ళినప్పుడు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

MYLABATHULA JEEVAN KUMAR
S/o. M.Benny paul, D.No. 2-36
Agarthipalem, Agarru Post, Palakol Mandal
West Godavari Dist., A.P.,

In The Court Of The IInd Addl. District Judge :: Amalapuram
O.S.No. 6/2022

Between:
వెల్లంకి కామేశ్వరి వగైరాలు ...పిటీషనర్లు
మరియు
కుకునూరి (కొంపెల్ల) వీరవెంకట సత్యనారాయణ వగైరాలు ...రెస్పాండెంట్లు
1) కుకునూరి (కొంపెల్ల) వీరవెంకట సత్యనారాయణ, తండ్రి: బుల్లిబ్బాయి, డో.నె. 1-1-20, స్టీయర్‌రోడ్, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.
2) కుకునూరి (కొంపెల్ల) సాయిఉదయ్, తండ్రి: వీరవెంకట సత్యనారాయణ, డో.నె. 1-1-20, స్టీయర్‌రోడ్, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా.
...రెస్పాండెంట్లు 1 మరియు 2

పై నెంబరు దావాలో పిటీషనర్లు వేసిన ఐ.ఎ.నెం. 135/2022, ఐ.ఎ.నెం. 136/2022 మరియు ఐ.ఎ.నెం. 137/2022లో నోటీసులు శ్రీ కోర్టు ద్వారాను, పోస్టల్ ద్వారాను పలుపర్యాయములు పంపించగా అమలు జరగనందున సదరు రెస్పాండెంట్లు 1, 2 లకు ఐ.ఎ.నెం. 135/2022, ఐ.ఎ.నెం. 136/2022 మరియు 137/2022లో అమలు నిమిత్తం **ది.30-01-2023వ తేదిన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలతియపరుచుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

అడపా వెంకట సత్యప్రసాద్,
అమలాపురం, **గుండాబత్తుల బాల రవితేజ,**
27-01-23. అద్వకేట్స్, అమలాపురం.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 199/2015

Petitioner (వాది): పెవసింగ్ రోజ
Defendants (ప్రతివాద్లు):
1. బొడ్డు రాజారావు (died) & 4 Others

4th రెస్పాండెంటు అడ్రస్సు:
D-4: కౌరు లక్ష్మి, D/o. late బొడ్డు రామస్వామి, 25వ వార్డు, భీమవరం.

5th రెస్పాండెంటు అడ్రస్సు:
D-5: మోరి రావమ్మ, D/o. late బొడ్డు రామస్వామి, 25వ వార్డు, భీమవరం.

పై నంబరు పిటిషనులో పిటీషనరు మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపిన మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున మీరు ది. 06-02-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై స్వయముగా గానీ, అడ్వకేటు ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల పై పిటిషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

కె.రాజశేఖర్
భీమవరం పిటిషనరు తరపు అద్వకేటు
ది.25-01-2023 భీమవరం

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 239/2018

వాది: శీరం నాగేంద్రరావు
ప్రతివాదులు:
1) దేవాబత్తుల పెద్దింట్లు
2) దేవాబత్తుల రత్నంరాజు
3) దేవాబత్తుల డేవిడ్
4) పెల్లూరి మరియమ్మ
5) దర్సి విజయ
6) మార్త జయ
7) ముసల దయామని
8) దేవాబత్తుల బులివెంకమ్మ
9) బల్లారపు జాన్సీరాణి, భర్త: తెలియదు, 1వ వార్డు, డో.నెం. 1-39, గణపవరం.

వాది దాఖలు చేసిన పై దావాలో 9వ ప్రతివాదికి వాదన ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.28-02-2023వ తేదీ పగలు గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మనవి చేసుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పై కోర్టు వారు వాది పక్షం ఉత్తరువులు జారీ చేయుదురు.

మందరపు వెంకటాచారి
భీమవరం, వాది తరుపు అద్వకేట్,
27-1-23. భీమవరం. సెల్: 98485 02377